"వాళ్ళు బయలుదేరారండీ, మరి మీ ఏర్పాట్లన్నీ ముగిసినట్టేగా?" అన్న కబురు జారేసిన పేరయ్య కండువాతో మొహంతుడుచుకుని మంచినీళ్ళ గ్లాసందుకున్నాడు. ఆయన రాకతో, వస్తూనే చేసిన హెచ్చరికతో, ఆ వాతావరణంలోని మందకొడి ఎగిరి చక్కాబోయింది. ఆపళంగా, "ఏమేవ్ తెమిలిందా?" అని ఒక్క గావుకేక పెట్టాడు గోవిందయ్య. మార్చివేసిన డ్రాయరుగుడ్డ మడతలు సవరించిందే సవరించి, మంచంమీద తలగడ దిళ్ళు అటునించీ ఇటుమార్చి, ఆ "అరేంజిమెంటు" బాగుండలేదనిపించి, మళ్ళీ ఇటువటు మార్చి, ఎరుపు తెచ్చిన వెండిపళ్ళెంలోని తమలపాకుల మోద అన్తవ్యస్తంగా వున్నట్టనిపించి, తోడిమిమీద తోడిమ అమిరేలా పొందిగ్గా అమిర్చిందే అమిర్చి, చేసిన పనే చేసి, చెయ్యనివి ఊహించుకొని, హైరానపడి అలిసిపోయింది మహాలక్ష్మమ్మ.

అవును మరి. వస్తున్నది మగపెళ్ళి వారాయెను. ఆడపిల్లని కన్న వాళ్ళకు ఆ మాత్రం తల విరబోసుకోకుండా, కాళ్ళు విరగదొక్కుకోకుండా, ఖంగారుపడకుండా ఎలా గడుస్తుంది? పాపం పెళ్ళికూతురు పని మరీ అధ్వాన్నంగా వుంది. ఒక చెంపని పెళ్ళిచూపులికి వస్తున్న వాళ్ళని తలచుకొని అసలే గుండె బేజారైపోతుంటే, చుట్టూతా మూగిన అమ్మలక్కలు మరీ ఖంగారు పెట్టేస్తున్నారు. సన్నజాజులు అలా, మాలగా పెడగా జారవిడిస్తే బాగుంటుందని ఒకామె సవరించింది.

అబ్బే- వచ్చేది పెళ్ళికొడుకు కాదాయెను. పెద్దవాళ్ళు, తల్లీ తండ్రీను -ఈ తెనుగు మీరిన పోకిళ్ళు నచ్చకపోవచ్చును. సంసార లక్షణంగా చెండు కిందచుట్టి తురిమితే సరిపాయె" అని మరొకామె ఇలా పెట్టా, తియ్యా పువ్వులు కాస్తా నలిగా చక్కాబోయినై.





దానా దీనా జాగర్తగా వేసిన జడంతా తిత్తులు తిత్తులై జడ మళ్ళీ అల్లాలిసి వచ్చింది. కళ్ళకి పెట్టిన కాటుక లగాయతు, కట్టుకున్న పావడా అంచువరకు ఎవరికి తోచిన అలంకరణలు వాళ్ళు దిద్ది తీరుస్తున్నారు. సలహాలు పుంఖానుపుంఖాలుగా ఇచ్చేస్తున్నారు. ఆపసోపాలు పడిపోతున్నారు.

ఆ ఒత్తిడికి పెళ్ళికూతురు జావజావయి పోయి, ఆ ఆయోమయంలో ముగ్గులో కూచున్న తరువాత పాడాల్సిన కీర్తన తాలూకు పల్లవి కాస్తా మర్చిపోయింది.

ఆమట్టుకి, మగపెళ్ళివారు అటు రిక్షాలు దిగేటప్పటికి, ఇటు తుది మెరుగులు దిద్దడం పూర్తికాలేదు.

కుటుంబయ్యగారూ కామాక్షమ్మా, మరో పెద్ద మనిషీ ముక్కలయ్యే మూడంకెకి ఝుడిసి మరో అయిదేళ్ళ నత్తరకాయిని వెంటబెట్టుకుని, ఇంటిముందు రిక్షా దిగగానే, పిల్ల తండ్రి గోవిందయ్య ఎదురువెళ్ళి సగౌరవంగా లోపలికి తీసుకొచ్చాడు. కాళ్ళు కడుక్కుందుకు నీళ్ళిచ్చారు. ఒత్తుకుందుకు తువాళ్ళు అందిచారు. మామూలు పరామర్శలయినై. కాఫీ ఫలహారాల తతంగం ముగిసింది. ఆ




తరువాత అటూ ఇటూ వంశ వృక్షాలు పెళ్ళగించి చూచుకున్నారు. గోత్రాలు కలువలేదు గదా అని ఆరా చూచుకున్నారు. ఆఖరికి మీరు మేమూ బీరకాయపీచేనూ అని తేల్చుకుని తృప్తిగా నవ్వుకున్నారు.

మరి కాస్సేపటికి అమ్మాయిని తీసుకొచ్చి ఎదురుగా సిరిచాపమీద కూర్చోబెట్టారు. పులి ముందు మేకపిల్లలా బెదురుతూ వచ్చి కూచుంది అమ్మాయి. అడగ్గా అడగ్గా పేరు చెప్పింది బిడియంగా, గభీమని చెబితే టపాకాయనుకుంటారని భయం, వెనువెంటనే చెబితే బెదరు గొడ్డనుకుంటారేమోనని బెదురుపుట్టింది.

ఒక పాట పాడమన్నారు. పాడింది. పల్లవితో మొదలుపెట్టాలిసింది చరణంతో ఎత్తుకుంది. పాటలో అవశ్రుతులు పలికినై. అనుకోనిది కంఠంలో జీర వచ్చివడింది. ఆరుగంటలవించీ సతమతమై తీర్చిదిద్దిన శృంగారమంతా పట్టుమని అరగంటయినా వట్టని పరీక్షలో ప్యాను మార్కులికి మొహంవాచి బ్రతుకుజీవుడా అని బైటపడింది పెళ్ళికూతురు.

చావిట్లో అబ్బాయి గుణగణాల ప్రసక్తి సాగిపోతోంది. కుటుంబయ్యగారు మీసాలు సవరించుకుంటూ, కుమారుడి చదువు సంధ్యలూ, ఉద్యోగ విశేషాలూ, అతని బుద్ధిమంతనమూ హుందాగా వివరిస్తున్నారు. ఆస్తిపాస్తులు పూజ్యమో ఏమో అది అంతగా ఏ కరువు పెట్టలేదు.

కామాక్షమ్మగారు కట్టుకున్న కంచి పట్టు చీర జరీఅంచు తళ తళ లాడుతోంది. ముక్కుమీద బేసరి మిలమిలలాడుతోంది. ఆవె మగబిడ్డను కన్న హోదాలో, నలుమూలలా పరకాయించి చూచి, ఆడపిల్లవారి అంతస్తు అంచనాలు వేస్తోంది.

వీడ్కోలు "అయిటం" దగ్గరపడింది.

"మీరు వెంటనే అబ్బాయికి ఉత్తరం రాసి రప్పిస్తారుకదూ బావగారూ? అశ్రద్ధ

చెయ్యద్దు, దగ్గరలోనే, ముహూర్తాలున్నాయి, తథాస్తనుకుంటే మంచిది." ఆడపిల్ల తండ్రి సహజంగానే ఆతృత వెళ్ళబోశాడు.

"ఆహా! మీరంతగా చెప్పాలా? ఇక వస్తామండి" అని సెలవు తీసుకుని తిరుగు ముఖం పట్టారు కుటుంబయ్యగారు సపరివారంగా.

పేరయ్య మట్టుకు కొంతసేపు ఆగి, వాళ్ళని పెళ్ళిచూపులికి ఒప్పించేసరికి తలప్రాణం తోక కొచ్చిందని ఆయాసపడిపోయి. అందుచేత ఆ సంబంధమెంత యోగ్యమైనదో అర్థంచేసుకొమ్మని వైన వైనాలుగా వివరించి చెప్పి. గోవిందయ్య చేత అవుననిపించి. ఆఖర్న సారాంశంగా, నీ యంతటివాడు లేడనిపించుకున్నాడు. "ఇక రేపు వారి అభిప్రాయం కనుక్కొని అబ్బాయిని రప్పించే భారం కూడా మీరే వహించాలనీ, ఈ సంబంధం కుదిర్చారంటే జన్మ జన్మలకూ మీ మేలు మరిచపోమనీ, కాస్త ఉబ్బేసి. కడాపట, సాభిప్రాయంగా మీ రుణం ఉంచుకోము నుమండీ అని సూచనలందించి, ఆడపిల్లని కన్నందుకు కసింత లౌక్యమూ, ఒకింత దైన్యమూ కలబోసి ఆ పెళ్ళిళ్ళ పేరయ్యని ప్రసన్నుణ్ణి చేసుకున్నడు గోవిందయ్యా.

"మీ కెందుకూ? ఆపూచీ నాది" అంటూ, ధీమాగా హామీ ఇచ్చి బైటికొచ్చాడు పేరయ్య.

ఇక అక్కడ పరిస్థితి-కుటుంబయ్యగారికి ఏకైక పుత్రరత్నం చిరంజీవి గోపాలరావు. తాను చేసిన ప్లీడరు గుమాస్తా వుద్యోగంలో గవర్నమెంటు వారి "హవుస్ బిల్డింగ్ స్కీముకింద," ఒక చిన్న పాటి కొంప సంపాదించుకున్నాడు. ఒక్కగా నొక్క కొడుకు, వాడికైనా మంచి చదువు చెప్పించండో అని కామాక్షమ్మ చెవి నిలు గట్టుకుని పోరగా పోరగా, అప్పట్లో బి.ఏ. చదువులు అడుక్కు తినేందుకైనా అక్కరకి రావనిపించి. ఉయ్యూరు పాలిటెక్నిక్‌లో "ఎలక్ట్రికల్ కోర్సు" చదివించాడు కుటుంబయ్య.

అంతే, రక్తపుపోటు ముంచుకు రావడంతో మూలపడ్డా డాయన. డాక్టరు విశ్రాంతి తీసుకొమ్మని సలహాయివ్వడంతో ఉద్యోగానికి తిలోదకాలు వొదులుకోక తప్పలేదు.

అప్పటికే పెళ్ళికెదిగి గుండెలమీద కుంపట్లై కూచుంది కుమార్తె. తొరతొరగా. ఏదో తన ఘటముండగానే వొదిలించుకుంటే మంచిదని. ఇంటిమీద అప్పుతెచ్చి పెళ్ళి అయిందనిపించి ఆ భారం తీర్చుకున్నాడు. అల్లుడాగారు చేస్తున్న హంగామాలు నడుస్తూనేవున్నాయి. ఒక చెంప నుంచీ.

కాని కొడుకు చదువు పూర్తయి ఉద్యోగం దొరక్క ఇంట్లో ఖాళీగా కూర్చోవడమూ. ఇంటి మీద చేసిన అప్పు కలలో కూడా భుజాలమీద బరువుగా పోకనూ, తాను ఎందుకూ వనికిరాకపోవడమూ కుటుంబయ్యగారు చాలా క్రుంగిపోయారు.

ఇంతలో అదృష్టవశాత్తు అంబాలాలో ఒక ప్రయివేటు ఫరంలో గోపాలరావు "ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌గా సెలక్టు" కావడంతో స్థిమిత పడ్డాడు కుటుంబయ్య కామాక్షమ్మ గారి సంతోషానికి మేరలేదు. ఇక కొడుక్కి కూడా వివాహంచేస్తే తానుకూడా ఒక వియ్యపురాలై. అటు అల్లుడు తమని పెడుతున్న అగచాట్లకి ప్రత్యామ్నాయంగా వియ్యాలవారి మీద అధికారాలు చెలాయించవచ్చని అంతర్గతంగానే సంబరపడింది. ఆవిడ ఆరాటానికి ఫలితంగా, ఎక్కడో దూరంగా అంబాలాలో ఉద్యోగం చేస్తున్న చిరంజీవి గోపాలరావు ఇక్కడి పెళ్ళిళ్ళ పేరయ్య జాబితాలో కెక్కాడు.

ఆస్థిపాస్తులు లేకపాయినా, పిల్లవాడి తండ్రి వెలిగించింది ప్లీడరు గుమాస్తాగిరీ అయితేనేంగాక కొంపంటూ ఒక గట్టిశాలీ కంటికి సదరుగా కనిపించడమూ, దానిమీద పేరుకున్న రుణమ్మాట దేవుడెరుగును-కుర్రాడు సలక్షణంగా చదువుకొన్నవాడు, చెప్పుకోగలిగిన ఉద్యోగంలోనే వున్నాడు. టెక్నికల్ ఉద్యోగఫాయ కాబట్టి ముందు ముందు పైకిపొయ్యే అవకాశాలు బోలెడువున్నాయి. అనిపించి అదే మహా భాగ్యమనుకొని ఆడపిల్లలున్న తండ్రులు వేటకి ఉపక్రమించారు. అందులో గోవిందయ్య ఒకడు.

ఇంటికి వచ్చింతర్వాత, భర్త అందించిన కండువా మడత తీసుకుని, వంకెకు తగిలిస్తూ "ఇంతోటి రంభకోసమేనా ఈ పెళ్ళిళ్ళ పేరయ్య అబ్బాయొచ్చేదాకా ఆగమన్నా ఆగక, మీరు ముందుచూడండి, మీకు నచ్చితే, అబ్బాయికి నచ్చకేం చేస్తుంది? అంటూ తరిమాడు? ముగ్గులోకి దిగేదాకా మన ప్రాణాలు తోడేశాడు, పైగా అయిదుగు రాడపిల్లలట? లక్షలుండనీ దరిద్రుడికింద లెఖ్ఖ. హయ్యోరాత ఇక అచ్చట్లూ ముచ్చట్లూ జరిగినట్లే" అని సాగదీసింది కామాక్షమ్మ.

తువ్వాలా భుజమ్మీద వేసుకొని వాలుకుర్చీలో తీరుబాటుగా జార్లబడ్డాడు. మాజీ ప్లీడరుగుమస్తా కుటుంబయ్య.

"పాపం ఆయన దేముంది. అటు గోవిందయ్య నస పెడుతుంటే ఇటు పేరయ్య మనల్ని నతాయించాడు. అలాని గోవిందయ్యను మాత్రం ఏమనగలంతే? ముందూ వెనకా చూచుకోకుండా వరసగా అయిదుగు రాడపిల్లల్ని కని, వూబిలో కూరుకుపోయివున్నాడు మానవుడు. మగరాయుడి వాసన తగిలితే ప్రాణం లేచిరాదూ? ఎవడికైనా అదేమరి. ఎగబడ్డాడంటే వింతేముంది?" అన్నాడు.

"బాగానే ఉంది మీ సమర్ధన.రిక్షా డబ్బులు కూడా దండగ" అన్నది విసుగ్గా.

"ఆ ఆ అలా అనకు మరి. ఇవాళ నీకు ఫలహారం చెయ్యడం తప్పిపోతే కొంటెగా భార్య వంకా చూశాడు కుటుంబయ్య.

"సరిపోయింది హాస్యం. మనకిమాత్రం కాలేచేతి చమురు భాగోతం . చామంతి పువ్వులకనీ, బత్తాయి పళ్ళకనీ, పెనిమిటి వేసిన లెఖ్ఖలో లాభానికి పోటీగా నష్టమెంతో ఎత్తిచూపింది కామాక్షమ్మ.

దానితో నవ్వేశాడు కుటుంబయ్య.

సంక్రాంతి పండుగ వారం పదిరోజులుంది. కూతురు సీతకి పెళ్ళయి కాపురానికి పంపి ఏడాది కావస్తోంది. అల్లుణ్ణి కూతుర్నీ పండక్కి పిలిచి ముచ్చటతీర్చుకోవాలని కామాక్షమ్మ కోరిక. కాని అల్లుడో మొండిఘటం. ఆ మాటకొస్తే ఏ అల్లుడు ఆరళ్ళు పెట్టడు? మొరాయించక పోతే అల్లుడే కాదాయెను. రిస్టు వాచీ ఇస్తానంటే పండక్కి వస్తానని పేచీ పెట్టాడు ముందస్తిగానే. ఇంట్లో అమ్మ దగ్గర ఖరీదుగల వస్తువులు గానీ, వాచీకాని అప్పుతెచ్చే స్తోమతగానీ తమకి లేదని తెలుసు.

ఆలోచించగా ఒకచక్కని ఉపాయం తట్టింది కామాక్షమ్మకి.

గోపాలం కిందటిసారి రాసిన ఉత్తరంలో తను రిస్టువాచీ కొనుక్కున్నట్టు రాశాడు. పండక్కి రమ్మనమంటే వాడూవస్తాడు. వచ్చినప్పుడు ఎలాగో నచ్చచెప్పి ఆ రిస్టువాచీ అల్లుడి కిప్పించవచ్చుని ఆమె యోచన. గోపాలం ఎలాగూ మెతక.తనమాట కాదనడు. ఇంకా తల్లిదండ్రులమాట జవదాటని స్టేజిలోనే ఉన్నాడు. కోడుక్కేముందీ రేపు అత్తవారి దగ్గరమాత్రం రాబట్టుకోలేడా? ఎవరికోసం పెడతారూ?

ఆ భరవసా మీద గోపాలానికి ఉత్తరం రాయించింది రమ్మనమని పండక్కి.

తిరుగుటపాలో కుమారుడి దగ్గరనించి ఉత్తరం రానే వచ్చింది. పోస్టు కవరు భర్తకు అందినా తొందరగా చూడండీ ఎప్పుడొస్తానని వ్రాశాడోను." అంది ఆత్రంగా కామాక్షమ్మ.

"అహ ఆగవోయ్! గుర్రాన్ని కాస్సేపు కట్టెయ్య మరీ?'' అని పెళ్ళాం తొందరపాటుకి నవ్వుకుంటూ కవరు చించారు కుటుంబయ్య. చదువుతున్న కుటుంబయ్య మొహమ్మీద కళలు రంగులు మారడం చూస్తోనే కామాక్షమ్మ నీళ్ళుగారి పోయింది.

ఉత్తరం చదవడం ముగించి కలవరంగా తన వంక చూస్తున్న కామాక్షమ్మ కేసి తిరిగి. "గోపీ రానని రాశాడే చేతిలో డబ్బు దాదాపు ఖర్చయిపోయిందట. కాస్తా, కూస్తానా, వంద రూపాయలదాకా దేకుతయ్యాయెను రానూ పోనూ రైలు ఛార్జీలు, చేతిలోవున్న పైకం చాలదు. రావటానికి వీలుకాదని వ్రాశాడు.

"నెల మధ్యనే పర్సంతా ఖాళీ అయిందా ఏం? అబ్బాయిపని పైలా పచ్చీసుగా వుంది మరీను." అని నిందాగర్భంగా నిష్ఠురోక్తులు పలికింది కామాక్షమ్మ. తను వేసిన పథకానికి అవాంతరం వచ్చిపడ్డదే అన్న అక్కసు కొద్దీ అలా అన్నదేగాని, కొడుకంటే ఆమెకీ ఆపేక్షే.

'పాపం. వాడు అలాంటి వాడుకాదే. మొన్న నీమధ్య వాచీకొన్నాడు కదూ. దానిఖరీదు నెల నెలా దఫాలవారీగా తీర్చుకునే పద్ధతి మీద కొని తెచ్చుకున్నాట్ట. దానిక్కూడా ఈ నెల డబ్బు కట్టాల్సి రావడంతో పైకం వెసులుబాటుకాక వాడికీ ఇబ్బందిగావుంది పాపం.'' అని సమర్థించుకనూ తప్పలేదు కుటుంబయ్యకి.

"సరి సరి. మొత్తానకి రాడని తేల్చారు. కానీండి. ఏమి చేస్తాం? చల్లబడిపోయి ఇంట్లోకి చక్కాబోయింది కామాక్షమ్మ.

కుటుంబయ్యకి భార్యని చూస్తే జాలేసింది. కొడుకునికూడా పండక్కి రప్పించి. కూతురు మొగుడుకి పండగ బహుమానం చదివించాలన్న ఆమెగారి పథకం ఇంకా ఆయన ఊహకందలేదు. కొడుకు రాడని దిగాలూపడిపోతోంది సన్యాసి అనుకున్నాడు.

కూతుర్నీ అల్లుణ్ణీ పెద్ద పండక్కి కళ్ళజూచు కొనే ఒకే ఒక్క మార్గం మూసుకు పోయేటప్పటికి నిరుత్సాహపడిపోయింది కామాక్షమ్మ. గోపాలం రానిదే వాచీరాదు. వాచీ ఇస్తామని ఖచ్చితంగా వ్రాస్తేనే తప్ప ఆ అల్లుడయ్య కదలిరాడు. వేరే ఉపాయమేమీ దొరక్క పండగ దగ్గరపడినకొద్దీ కామాక్షమ్మకి గంగవెర్రు లెత్తినై రోజులు దొర్లిపోతున్నాయి.

గడపకి జార్లపడి గోడమీది బల్లివంక ఖాళీగా చూస్తున్న కామాక్షమ్మ అప్పుడే బైటనుంచీవచ్చీ అయిమూలగా ఆకు చెప్పులు విడుస్తున్న భర్త పలకరింపుతో ఉలిక్కిపడింది.

IIIIII

"బాగానే వుంది మీ పొడుపు కథ! తిన్నగా చెప్పక ఈ దొంకతిరుగుడేమిటో అవతల నాకు పాలు పొంగొచ్చినయ్యో ఏమో" అని విసుక్కున్నదామె.

"ఉండు ఉండు చెప్పనీ. ఇందాక పేరయ్య వచ్చి ఆ గోవిందయ్య గారి శేమి చెప్పమాన్నారంటూ అడిగాడు."

రామాయణంలో ఈ పిడకలవేట ఏమిటని కోపగించుకుంది కామాక్షమ్మ.

"ఆగుమరీ– అలా రెచ్చిపోకోయ్. "మాకు నచ్చింది కాని. అబ్బాయి పిల్లని చూడకుండానే ఏనంగతీ తేల్చడానికి వీలులేదన్నాను. ఆమైన అబ్బాయిని వెంటనే పిలిపించమన్నాడు. నేనే మన్నానో తెలసా?" అని పెళ్ళాంవంక గొప్పగా చూశారు కుంటుబయ్య మళ్ళీ.

అడుగడుక్కీ సస్పెన్సు" లో పెడుతున్న భర్త ధోరణికి ఒళ్లు మండి మాట్లాడలేదు కామాక్షమ్మ.

భార్య అలకకి నవ్వుకున్నాడు కుటుంబయ్య. "పూర్తిగా వినకుండా ముడుచుకుపోతావేమిటోయ్ అంత దూరంనుంచీ ఈ ఒక్కపిల్లని చూచేందుకని పనిగట్టుకుని రావడం ఇంతట్లో పడదూ. దారి ఖర్చులే బోలెడవుతయ్యన్నాను. అవి భరించేటట్టయితే వాణ్ణి రప్పించినా మా, కభ్యంతరం లేదన్నాను. ఎలా వుంది మన పథకం? అవి మళ్ళీ కళ్ళెగరేశాడు కుటుంబయ్య.

"ప్లాను బాగానే వుందిగాని పిల్ల మనకే నచ్చలేదాయే. ఇక వాడికేం నచ్చుతుందండీ. అదలా వుణ్ణీండి. వాడు చదువుకున్న పిల్లనే గాని, ససేమీ చేసుకోనని మనకి ముందే చెప్పేడు?" సందేహం వెలిబుచ్చింది కామాక్షమ్మ.

ఆమె తెలివి తక్కువకి జాలిపడుతూ, "నేను మాత్రం వాడికి పిల్ల నచ్చుతుందనుకుంటున్నానుటే? ఎలాగూ నచ్చదు. నచ్చదని మనకి తెలుసు. కాకపోతే వచ్చిం తరువాత ఓసారి వెళ్ళి ఆ పిల్లనిచూసి మొక్కుబడి చెల్లించుకొని పోతాడు. అంతే" అన్నాడు.

"తీరామోసి అంతడబ్బు వాళ్ళిచ్చుకున్న తరవాత పిల్ల నచ్చలేదూ అంటే ఊరుకుంటారుటండీ మీ పిచ్చిగానీ"

ఓసి దేభ్యం- ఊరుకోక ఉరిపోసుకుంటారాంట? వాణ్ణి రమ్మని రాసేదాకానే మనవంతువాడు వచ్చాక పిల్ల నచ్చిందన్నా. నచ్చలేదన్నా మాకు నిమిత్తంలేదు సుమండీ" అని ముందే చెప్పేశా. సొంతం వినుమరి. వాళ్ళందుకు వొప్పుకున్నారని ఇందాకనే ఆ పేరయ్య పైకమిచ్చి వెళ్లారు" అని వందరూపాయల నోటు టేబులుమీద ఉంచాడు కుటుంబయ్య.

"నిజంగానే" సంతోషంతో మొహం చింకిచేటయిపోయింది కామాక్షమ్మకి.

అప్పటికిగాని స్ఫురణకీ రాలేదామెకి తన పెనిమిటి పిల్లిమీదపెట్టి ఎలకమీద పెట్టీ పార్టీల దగ్గర మామూళ్ళు దంచుకోవడంలో రాటుదేరిన మాజీ ప్లీడరు గుమాస్తా అని.

"ఆహా- నీ కొడుకు పండక్కి మన ఇంట్లో వుండేది ఖాయం" అంటూ హుటాహుటిని పోస్టాఫీసుకి బయుదేరాడు కుటుంబయ్య మనీయార్డరు కట్టేందుకు.

కామాక్షమ్మ కోరిక నెరవేరింది.

కొడుకు వచ్చాడు పండక్కి ఇటునుంచీ వాచీ ఇస్తామన్న హామీపత్రం అందుకున్న అల్లుడూ, కూతురూ రెండు రోజులు ముందుగానే నట్టింట అడుగుపెట్టారు.

వండగ నరదాలన్నీ నజావుగానే నడిచిపోయినై.

గోపాలం బుద్ధిమంతుడు. అమ్మ మాట కాదనలేదు. అనుకున్న ప్రకారం గోపాలం రిస్టు వాచీ బహూకరించి బావగారి అలక తీర్చాడు.

కూతురూ. అల్లుడూ వెళ్ళిపోయారు.

కనుమూ ముక్కనుమూ అయిన తరువాత గోపాలం కదిపాడు.

"ఇప్పుడు వంద రూపాయలు రైలు ఖర్చులికి పోసి నన్ను రిప్పించకపోతేనేం నాన్నగారూ. అది సరే. ఇంతడబ్బు మీకెక్కడిది. మళ్ళీ ఆ కొంపమీద అప్పు తీసుకు రాలేదుగదా కొంపతీసి" అన్నాడు.

కామాక్షమ్మ నవ్వుతూ చూసింది పెనిమిటి వంక, మీరు చెప్పండి" అన్నట్టు.

గుబురు మీసాలల్లోంచీ ముసిముసిగా నవ్వుతూ మొదలు పెట్టాడు మాజీ ప్లీడరు గుమాస్తా కుటుంబయ్య.

"అవునయ్యోయ్, మర్చేపోయాను, నీకిక్కడ ఓ పిల్లని చూశాము. రేపో మాపో నువ్వుకూడా చూసికాదనేసిరా" అన్నాడు.

"కాదని రావడమేమిటి? మీరు ముందే చూశారా ఎలా వుంటుందమ్మాయి. చదువుకున్నదా ఎంత వరకు" ఒకటి తరువాత ఒకటిగా ప్రశ్నలు గుప్పించాడు చిరంజీవి గోపాలరావు.

"అందంమాట దేవుడెరుగును కనీ, అవకరంగా లేదు. ఇక చదువుంటావా ఎ బి సి డి లు నువ్వే చెప్పాలి." వెటకారంగా అంది కామాక్షమ్మ.

"మరి ఆ మాత్రం దానికి నేనుకూడా చూట్టం దేనికే అర్థంగాక అడిగాడు గోపాలం.

"ఆహా అలా కాదులే" ఓసారి చూచివస్తేనే బాగుంటుంది. పాపం నిన్ను పిలిపించమని వందరూపాయలూ ఆపిల్ల తండ్రే ఇచ్చుకున్నాడు. అక్కడలేని గోవిందయ్య మీద కాస్త సానుభూతి వొలకబోశాడు కుటుంబయ్య.

"ఆయన ఇచ్చుకోవడమేమిటి?" నిర్ఘాంత పోయాడు గోపాలం.

"మీనాన్న ఓచిట్కా వేశారు లేరా పెనిమిటివంక మురిపెంగా చూసింది కామాక్షమ్మ.

"ఏం చెయ్యమన్నావు మరీ. నువ్వు రావని మీ అమ్మ వల వల వాపోతుండెను." వివరించి చెప్పాడు కుటుంబయ్య ఎలా వాళ్ళకీ టోకరా యిచ్చిందీ. ఎలా రైలుఖర్చులు పడేసిందీను.

"నేనైనా వట్టినే తొందరపడ్డానా?

బిడ్డ ఏడాదయి అత్తవారింటికి

వెళ్ళిందాయెను. మళ్ళీ మనకంట బడనివ్వకుండా, పిలిచినప్పుడల్లా "వాచో" వాచో" అంటూ గోల చేస్తున్నాడయ్యే అల్లుడు. నిన్ను రప్పిస్తేనే గాని ఆ ముడుపు తీర్చేదారి కనపడలేదు నాకు" అంది కామాక్షమ్మ.

అంతా విన్నాడు గోపాలం.

"అంతా విన్న గోపాలం మొహం నల్లబడి పోయింది.

కాస్సేను మౌనంగా ఉండిపోయాడు.

పెద్దలు- తల్లిదండ్రులు- ఏమనగలడు? తప్పనరిగా తప్పు చేస్తున్నట్టు తెలిస్తే గోవిందయ్యగారింటికి వెళ్ళి పెళ్లి చూపులయి నయ్యానిపించి మొక్కుబడి తీర్చుకుని మరునాడే అంబాలా వెళ్లిపోయాడు.

మూడురోజులు పోయిన తరువాత గోపాలం దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"పూజ్యపాదులు నాన్నగారికి నమస్కారాలు. నేను మీకు చెప్పగల వాణ్ణికాదు. మీ కున్న అనుభవం నాకులేదు. అయితే ఈ ప్రపంచంలో నలుగుడుబడి దానిమకిలి ఇంకా అంటించుకోలేదు. న్యాయా న్యాయ విచక్షణ ఏ కొంచెమో మిగిలిఉంది నాలో, అని అనుకుంటున్నాను. మనకీ ఒక ఆడకూతురుంది. దానిని ఒక అయ్య చేతిలోపెట్టేందుకు మనమూ చెప్పులరిగేలా తిరిగాము. తడిమన్ను పోడిమన్నయింది. పడరాని పాట్లు పడ్డాము. ఆ మూడుముళ్ళూ పడినై. అల్లుడు పెడుతున్న ఆరళ్ళు ఒకచెంప అనుభవిస్తూనే వున్నాం అవునా?

మనలా ఆడపిల్లని కన్నవాడే కదా ఆ గోవిందయ్యాను. అతగాడూ మనకి మల్లేనే అష్ట కష్టాలూ పడవలసినవాడేకదా. ఎక్కడి వరుడున్నాడంటే, అక్కడికల్లా పరుగెత్తి అంచనాలు వేసుకుని, ఆశలుపోయి, అన్పుర్పుమని, దిగుళ్లు పెట్టుకుని అల్లాడుతున్న గృహస్తేకదా.

మనకి ఒక్కటే గుండెలమీద కుంపటి. ఆ దిక్కుమాలినాడికి అయిదున్నాయి కుంపట్లు.

పిల్లమీకు నచ్చలేదు, నాకు నచ్చదనీ తెలుసు. తెలిసీ నన్నెందుకు రప్పించారు. రప్పించేందుకు ఆ ఖర్చుల క్రింద అయిదుగురాడపిల్లల్ని కన్న ఆ అభాగ్యుడి నెత్తిమీద చేతులు పెట్టి వందకరుకు లెందుకు వసూలుచేశారు.

ఇంత దారుణమా?

పిల్లనచ్చని వరుళ్ళకోసమే కిలాడీగా ఇలా వాళ్ళూ వీళ్ళూ పిండితే, పెళ్ళి కుదిరేనాటికి ఆ పిల్లలకోడిలో నెత్తురెంత మిగలేను. అల్లుడు దశమ గ్రహమని వూరికే అన్నారా. ఆ పెళ్ళి ఆయింతరువాత అల్లుడు పెట్టే అగచాట్లు వుండనే వున్నాయి. మనల్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు త్రాగించటంలేదూ బావ మొన్నటి రిస్టువాచీ పండుగ బహుమతికింద మన మిచ్చిందీ బావ మనకు వేసిన జాల్మానా.

పెళ్ళికి ముందూ వెనకాకూడా అయిందానికీ, కానిదానికీ, అడుగడుక్కీ టోపీ వెయ్యదలచుకున్న వాడికల్లా తలవొంచి రక్తం ధారపోయ్యాలినవన్నే, ఆ మానవుడి గతేంకాను.

చెల్లాయినీ బావనీ పండక్కి పిలిపించి బావ గారి వాచీ ముచ్చట తీర్చలని అమ్మ ఉబలాట పడిందే అనుకోండి దానికి ఇన్ని వంకరనడకలు నడవాల్నా.

నాకు వ్రాస్తే రిస్టు వాచీ రిజిస్టర్డ్ పార్సిల్‌చేసి పంపేవాణ్ణి కదా.

వాళ్ళ దగ్గర డబ్బు గుంజి నన్ను రప్పించటం నచ్చనిపిల్లని, నాకు నచ్చదని తెలిసినా చోట్టినేచూచి రమ్మనమనీ నన్నక్కడికి పంపడందేనికి.

బావకి రిస్టువాచీ బహూకరించి మన పబ్బం గడిపేందుకా ఈ తంతు.

ఇది యెంత ఘోరమో ఆలోచించారా?

ఇదంతా మీ కెలావున్నదోగాని నాన్నా నాకు నిజంగా సిగ్గుచేటుగా వుంది. ఇంతకి దిగజారామా అని.మీదుమిక్కిలి చేసిన ఘనకార్యానికి. ఆనాడు మీరేదో గర్వంగా చెప్పుకుపోతుంటే... నువ్వేమనుకో నాన్నా తల కొట్టేసినట్టయింది...... ఒక్క మాటలో అసహ్యంపుట్టింది చెప్పద్దూ..

మీరు ఆ సంబంధాన్ని గురించి వివరించిన తరువాత. మీరు పంపిన వంద రూపాయలూ ఆ గోవిందయ్య దగ్గర వసూలు చేసిన పైకమని మీ ముఖతా మాటలు విన్న తరువాతా, నాకు నేనెంత క్రుంగిపోయానో మీకు తెలియదు.

ఆ అమ్మాయి ఎలావున్నా ఆ సంబంధాన్ని చేసుకోవాలనే అనుకున్నాను మొదట్లో.

కాని ఎంతో ఆలోచించుకున్న మీదట. ఆ నిర్ణయం మార్చుకున్నాను.

నాకు కావలసింది. నాతో బరువు భాధ్యతలు పంచుకునే భాగస్వామిని నా జీవితాన్ని జీవితాన్నే కాక నా కష్టాలని, నా సమస్యల్నీ కూడా సమంగా పంచుకోగలగాలి ఒక మాటలో ఆర్థికంగా నన్ను ఆదుకోగలగాలి నాకు కాబోయే భార్య. అలాగని ఆవిడ పుట్టింటి దగ్గర్నించి అవీ యివీ తెచ్చి నాయిల్లు నింపాలని నేనాశించను. నాకూ అభిమానముంది. తానుకూడా ఉద్యోగంచేసి చన్నీళ్ళకి వేన్నీళ్ళుగా నాకుసహాయ సంపత్తులందిస్తూ నాకున్న కర్తవ్య భారాన్ని సమంగా

కాకపోయినా. అంతకుకొంత పంచుకొని నన్ను కన్న వాళ్ళపట్ల నాకు వుండుకున్న భాద్యతల్ని అర్థంచేసుకుని సానుభూతి అందించగల వధువుని కోరుకుంటున్నాను నేను.

నా నిర్ణయాన్ని స్పష్టంగా మీకు ఇదివరకే తెలిపినట్టు గుర్తు. అందుకు కారణం ఇప్పుడు స్పష్టంగా చెబుతాను.

ప్రస్తుతం నాకొచ్చే జీతంతో కుటుంబ ఖర్చుల కింద ఒక వందా, ఇంటిమీద వున్న అప్పు తీరుమానం కింద మరోవందా, వెరసి రెండు వందలు పంపుతున్నానా అది పోను, మిగతా నూట యాభైతోనూ నేనిక్కడ అతి పొదుపుగా వాడుకుంటుంటే బొటాబొటీగా సరిపోతుందనుకో.

నేను దూరేందుకు కంతలేదు నామెడకొకడోలా? నాకున్న బాధ్యతలలో కొన్నింటిని తప్పనిసరిగా సడలించుకోవాలి అనుకోండి. వృద్ధులై నామీదనే ఆశలన్నీ పెట్టుకున్న నా జననీజనకులు మిమ్మల్ని ఒదిలించుకోనా లేకపోతే ఇంటి మీద పేరుకున్న రుణభారం అలా గాలికి వదలి టింగురంగా అంటూ నాదారి నేను చూచుకోనా రెండూ తగనివే రెండూ నేను చెయ్యరానివే. చెయ్యలేనివే. అందుకనే చదువుకున్న పిల్లని పెళ్ళి పీటలమీదికి తెచ్చుకుంటే ఉభయతారకంగా వుండచ్చునని నా తాపత్రయం.

అప్పుడే నన్ను కని పెంచినందుకు మీకు గాని, కొడుకునైనందుకు నాకుగాని బ్రతుకు సుగమం కాగలదని నా ఆశ.

మీరిప్పుడు చిన్న పొరపాటు చేశారు కదా అని నేను కూడా తొందరపడి నా ఆశయాలకి విరుద్ధంగా నేను వేసుకున్న అంచనాలన్నీ తారు మారు చేసుకోనా చదువు సంధ్యలు లేని పిల్ల నసలు ఎందుకు చూశారు నాకు.

ఇక పోతే మన స్వార్థాలేవో తీర్చుకుందుకు మనలాంటి మరో నిర్భాగ్య జీవిని వంచించామన్న భావన నన్ను వేధిస్తోనే వుంది.

నాకు ఈ నెల అందిన జీతం మూడు వందల యాభైలోనూ ఒక వంద మీ కుంటుంబ ఖర్చుల కింద ఒక వంద అప్పు తీర్చేందకూ. ఒక వంద గోవిందయ్యగారి వాపసు చేసేందకూ వెరశి మూడు వందలూ పంపుతాన్నాను. తతిమా యాభై రూపాయలతోను నేనీనెల గడుపుకుంటాను ఇది నాకు నేనయి విధించుకుంటున్న శిక్ష అనుకున్నా ఫరవాలేదు.

నా అవిధేయతకు మన్నించండి.

"గోపాలం".

ఉత్తరం చదవటం ముగించేసరికి కుటుంబయ్య కళ్ళు చెమర్చినాయి.

ఆ మహాపట్నంలో యాభై రూపాయలమేరకి జీవితాన్ని కుదించుకోవాలంటే మాటలా?

మనియార్డరు వచ్చింది.

"ఒక యాభై రూపాయలయినా వాడికి తిరిగి మనియార్డరు చెయ్యండి."

అన్నది కామక్షమ్మ కళ్ళు ఒత్తుకుంటూ.

●